# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 20, మార్చి, 2015

కృష్ణా, గోదావరి నదులపై ప్రతిపాదించిన ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తి చేసే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించుకుని కార్యరంగంలోకి దూకాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. మంచినీటి పథకం, విద్యుత్ ఉత్పత్తి మాదిరిగానే నీటి పారుదల ప్రాజెక్టులన్నింటిని కూడా పూర్తి చేసి గోదావరి, కృష్ణా నీటిని సమర్ధవంతంగా వినియోగించుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న కేటాయింపులతో పాటు మరో 120 టిఎంసిల వరకు అదనంగా తెలంగాణ రాష్ట్రానికి కేటయింపులు జరిగే అవకాశం ఉన్నందున ఈ నీటిని అంతటిని ఉపయోగించుకునే విధంగా ప్రాజెక్టులను సిద్దం చేయాలని సూచించారు. పాలమూరు ఎత్తిపోతల పథకం, నక్కలగండి ఎత్తిపోతల పథకాలకు వచ్చే నెల మొదటి వారంలో శంఖుస్థాపన చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. మహాబూబ్‌నగర్, నల్లగొండ లాంటి జిల్లాలకు సమర్ధవంతంగా సాగునీరు అందించినప్పుడే తెలంగాణ రాష్ట్రానికి సార్థకత అని కేసిఆర్ అన్నారు.

సచివాలయంలో శుక్రవారం నీటిపారుదల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ప్రభుత్వ సలహదారులు పాపారావు, విద్యాసాగర్ రావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి జోషి, ఇఎన్‌సి మురళీధర్, రిటైర్డు ఇంజనీర్ల సంఘం నాయకులు శ్యామ్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దక్షిణ తెలంగాణలో పాలమూరు, ఎస్‌ఎల్‌బీసి, నెట్టెంపాడు, పెండ్లిపాకల, నక్కలగండి, ఉత్తర తెలంగాణలో ప్రాణహిత (కాళేశ్వరం), కంతనపల్లి ప్రాజెక్టులను పరి చేయాలని, పాములపర్తి, తడకపల్లిలో రిజర్వాయర్లు నిర్మించాలని, ఖమ్మం జిల్లా రైతులకు ఉపయోగపడే విధంగా దుమ్ముగూడెం

ప్రాజెక్టులో మార్పులు చేయాలని, దేవాదులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సిఎం అన్నారు.

పాలమూరు ఎత్తిపోతల పథకం నిజానికి కొత్తది కాదని, గతంలోనే నీటి కేటాయింపులు, అనుమతులు కలిగిన భీమా ప్రాజెక్టేనని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్నప్పుడే గుల్బర్గ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన 4.25 లక్షల వ్యవసాయం భూమికి నీరిచ్చేందుకు 100 టిఎంసిల నీటి నిలువ సామర్థ్యం కలిగిన భీమా ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందన్నారు. దీనికి సంబంధించి అసెంబ్లీ లైబ్రరీలో ఆధారాలున్నాయన్నారు. భీమా ప్రాజెక్టునే పాలమూరు ఎత్తిపోతల పథకంగా అమలు చేస్తూ సాగునీరు అందించడంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంచినీరు ఇవ్వాలన్నారు. గతంలోనే అనుమతులు ఉన్నందున ఇక కొత్తగా అనుమతులు తీసుకోవలసిన అవసరం రాకపోవచ్చని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో ప్రాజెక్టులు పూర్తి కావద్దని, కేటాయించిన నిధులు ఖర్చు కావద్దనే ఉద్దేశ్యంతోనే సమైక్య పాలనలోనే డిజైన్‌లు తయారయ్యాని అన్నారు. అందుకు ప్రాణహిత ప్రాజెక్టును ఉదాహరణగా చెప్పారు. సులభంగా పూర్తయ్యే ప్రాజెక్టులను కూడా వివాదాల్లోకి నెట్టి తెలంగాణ రైతులు లబ్దిపొందకుండా చేశారన్నారు. ఇతర రాష్ట్రాలతో లంకె పెట్టి, అటవీ శాఖతో కొర్రిలు పెట్టించుకుని ప్రాజెక్టులను పీటముడులుగా మార్చారన్నారు. అందుకే తెలంగాణలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కావట్లేదని అభిప్రాయ పడ్డారు. మహరాష్ట్రతో గొడవ లేకుండా ప్రాణహిత, గోదావరి నదులను కలుపుతూ కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే అన్ని విధాల మేలని సిఎం అన్నారు. ప్రాణహిత పేరుకు బదులుగా ఈ ప్రాజెక్టుకు కాళేశ్వరం పేరు పెడితే సమంజసంగా ఉంటుందన్నారు. ప్రాణహితతో పాటు మిగతా ప్రాజెక్టుల విషయంలో కూడా రీ ఇంజనీరింగ్ జరగాలని అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదులపై ప్రతిపాదించిన ప్రాజెక్టులపై అధ్యయనం చేయడానికి రిటైర్డు ఇంజనీర్లను వచ్చే వారం హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వేకు పంపుతామన్నారు. వారసత్వంగా దక్కిన ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేస్తామన్నారు. కృష్ణా,

గోదావరి నదులపై చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించి చెరొక ఆర్ అండ్ ఆర్ (రీహేబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) కమిషనర్లను నియమిస్తామని చెప్పారు. ఇరిగేషన్ శాఖకు రెవిన్యూ, ఇంజనీరింగ్ స్టాఫ్‌ను కూడా అదనంగా కేటాయిస్తామన్నారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్దవంతంగా వాడుకోవడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువకు చరిత్రలోనే మొదటిసారిగా రెండో పంటకు నీరిచ్చామన్నారు. వచ్చే నెలలో శంఖుస్థాపన చేయనున్న పాలమూరు, నక్కలగండి ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. టన్నెల్, రిజర్వాయర్, పంపు హౌజ్ పనులన్నీ ఏకకాలంలోనే జరగాలన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం